
పుష్కరిణి చుట్టూ భక్తుల కోలాహలం


శ్రీశైలంలో జ్వాలా తోరణం

శివయ్య క్షేత్రంలో జ్వాలా తోరణం


కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు





- శ్రీశైలంలో వైభవంగా కార్తీక పౌర్ణమి
- ఘనంగా లక్ష దీపోత్సవం, గంగా హారతి
- భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరి

శ్రీశైలం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభోశంకర.. ఓం నమఃశివాయ.. అంటూ భక్తుల శివనామస్మరణతో శ్రీగిరి క్షేత్రం మార్మోగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగమైన శ్రీశైల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మల్లికార్జునస్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో శ్రీగిరి క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దర్శనానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు తెల్లవారుజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పాతాళగంగ వద్ద పుణ్యనదీ హారతి, ప్రధాన ఆలయానికి ముందుభాగాన గంగాధర మండపం వద్ద జ్వాలాతోరణం, ఆలయ పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం, పుష్కరిణికి దశ విధ హారతులు కన్నులపండువగా సాగాయి. పౌర్ణమి సందర్భంగా క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. భ్రమరాంబమల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పాతాళగంగలో అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు వేకువజాము నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. కార్తీక పౌర్ణమి వేడుకలను దేవదాయశాఖ జాయింట్ కమిషనర్, కార్తీక మాసోత్సవాల ప్రతేక అధికారి ఎస్. ఎస్ చంద్రశేఖర ఆజాద్, ఈఓ చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

జ్వాలాతోరణం

శ్రీశైలం మహా క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఆశీనులనుజేసి మంగళవాయిద్యాల నడుమ ఆలయం ముందుభాగాన ఏర్పాటు చేసిన జ్వాలాతోరణం వద్దకు తోడ్కొని వచ్చి పూజాదికాలు నిర్వహించి, జ్వాలాతోరణాన్ని ప్రజ్వలింపచేశారు. ఈ జ్వాలాతోరణ భస్మాన్ని నుదుటన ధరించడం వలన ఆరోగ్యం, ఆయుష్షు, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. కాగా జ్వాలా తోరణం వేడుకలో వినియోగించే నూలు ఒత్తులను బాపట్ల జిల్లా వేటపాలెం మండలం, ఆమోదగిరిపట్నానికి చెందిన భక్తులు వసుంధరరావు, రామకృష్ణారావు సంప్రదాయబద్ధంగా మేళతాళాలతో వచ్చి సమర్పించారు.

లక్ష దీపోత్సవం

మల్లన్న కొండపై శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమిని సందర్భంగా లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి పుష్కరణి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆ తర్వాత పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా వివిధ ఆకృతుల్లో రూపొందించిన దీపాలను వెలిగించి పూజాదికాలు చేపట్టారు.

కర్నూలు నగరం.. కార్తీక శోభితం

- వినాయక ఘాట్‌లో ఘనంగా వేడుకలు
- వివిధ ఆలయాలు, తుంగభద్రనదీ తీరాల్లో పూజలు

కర్నూలు కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో విచ్చేసే కార్తీక పౌర్ణమి సందర్భంగా నగరం ఆధ్యాత్మిక శోభితంగా మారిపోయింది. పున్నమి వెలుగులో నింగిలోని తారలన్నీ నేలపై వెలిగినట్లుగా... కార్తీక పౌర్ణమి దీపోత్సవ శోభ నగరాన్ని పసిడి కాంతులతో నింపింది. చిరుదివ్వెల కిరణాలన్నీ వేవేల వెలుగుల్ని విరజింపజేశాయి. శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను నగరంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నగరంలోని వివిధ ఆలయాలు, ధార్మిక క్షేత్రాలు, కేసీ కెనాల్ ఒడ్డున శుక్రవారం సాయంత్రం నుంచి నిర్వహించిన కార్తీక దీపోత్సవం కన్నుల పండువలా సాగింది. శైవ, వైష్ణవ ఆలయాల్లో కార్తీక దీపాలు, జ్వాలా తోరణాల మహోత్సవాలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కర్నూలు కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఘాట్‌కు ఇరువైపులా విద్యుద్దీపాలతో అలంకరించి, కాషాయ పతకాలను ఏర్పాటు చేశారు.




జ్వాలా తోరణం వెలిగిస్తున్న


భక్తులతో కిక్కిరిసిన వినాయకఘాట్




చింతలచెరువులో కేపీ ఉల్లిని దున్నేస్తున్న రైతు

ఉల్లి రైతుకు కన్నీళ్లు

చాగలమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంట చేతికి వచ్చే టయానికి ధరలు పతనమయ్యాయి. అసలే దిగుబడి భారీగా తగ్గిపోయింది. ఈ ఏడాదైనా ఉల్లి పంట సాగు చేసి అప్పులు తీర్చుకుంటామని అనుకుంటుండగా అధిక వర్షాలతో దిగుబడి లేక, ధరలు లేక అప్పుల ఊబిలో కూరుకపోతున్నామని రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్‌కు తీసికెళ్లే ఖర్చు కూడా రావడం లేదని దున్నేస్తున్నారు. ఎర్రగా నిగనిగలాడే క్రిష్ణాపురం(కేపీ ఉల్లి) ఉల్లి గడ్డలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. అయితే రాష్ట్రంలో మార్కెట్ సౌకర్యం లేదు. గత ఏడాది క్వింటం రూ.7 వేలు పలికింది. ధర ఉండటంతో ఈ ఏడాది కేపీ ఉల్లి అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ధర పతనమైంది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు కన్నీరు పెడుతున్నారు. ఎకరాకు రూ.80 వేలు నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. తెగుళ్లతో కేపీ ఉల్లి దిగుబడి భారీగా తగ్గింది. మండలంలోని చింతలచెరువు, కొలుములపేట, పెద్దవంగలి, చిన్న వంగలి, మూడురాళ్లపల్లె, కొత్తపల్లె, ఆవులపల్లె గ్రామాల్లో కేపీ ఉల్లిని సాగు చేశారు. 1,000 ఎకరాల్లో కేపీ ఉల్లి పంటను సాగు చేశారు. ఒక్క చింతలచెరువు గ్రామంలోనే 300 ఎకరాలకు పైగా ఉల్లి పంట వేశారు. పంట ఏపుగా పెరిగి దిగుబడి వచ్చే సమయంలో అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల పంట దెబ్బతినింది. పంట చేతికొచ్చే సమయంలో ధర కూడా తగ్గడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 40 క్వింటాళ్ల నుంచి 60 క్వింటాళ్ల దాక దిగుబడి రావాల్సి ఉండగా 10 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. క్వింటం రూ.4 వేలు ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది రూ.7 వేలు క్వింటం ధర రావడంతో రైతులు అధిక శాతం సాగు చేశారు. అయితే ఇప్పుడు ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. 8 ఏళ్ల కిందట దాదాపు 10 వేల ఎకరాల్లో కేపీ ఉల్లి పంట సాగు అయ్యేది. ప్రస్తుతం 1,000 ఎకరాలకు పడిపోయింది. అయితే వ్యాపారులు, దళారులు నిర్దేశించిన ధరకే విక్రయించుకోవాల్సి రావడంతో పంట సాగు చేసే రైతుల సంఖ్య తగ్గిపోతోంది. పంట దిగుబడి లేకపోవడంతో కొందరు రైతులు కేపీ ఉల్లి పంటను పొలాల్లోనే దున్నేస్తున్నారు.

మిగతా 6లో..

- తెగుళ్లతో భారీగా తగ్గిన దిగుబడి
- పంట పొలాలను దున్నేస్తున్న అన్నదాత
- సాగు ఖర్చులు కూడా రాని వైనం

మార్కెట్ సౌకర్యం కల్పించాలి

కేపీ ఉల్లి కొనుగోలు చేసేందుకు మార్కెట్ సౌకర్యం లేక రైతులు నష్టపోతున్నారు. 100 క్వింటాళ్ల బస్తాకు అదనంగా 15 కేజీలు ఇవ్వాల్సి ఉంటుంది. వ్యాపారులు తూకాల్లో రైతులను దగా చేస్తున్నారు. దీంతో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక మరో వైపు దళారుల వ్యవస్థ వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. విదేశాలకు సరఫరా చేసే కేపీ ఉల్లి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాఫెడ్, మార్క్‌ఫెడ్ అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి మార్కెట్ సౌకర్యం, మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె

నోటీసులు జేసీకి అందజేసిన నాయకులు


సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు 108 కాంట్రాక్టు ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్ కుమార్ రెడ్డి, టీ. రాంబాబు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 వ్యవస్థను ప్రభుత్వం నిర్వహించి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు, అర్జిత సేలవులకు అరవింద సంస్థ నుంచి ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు. నాలుగేళ్లనుంచి బకాయి పెట్టిన 40 శాతం ఇంక్రిమెంట్ చెల్లించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని కోరారు.

ప్రేమ పేరుతో మోసం

ఆదోనిలో ప్రియుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన 7

లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కర్నూలులోనే : మంత్రి టీజీ భరత్

ఆదోనిలో భారీగా రేషన్ బియ్యం సీజ్

ప్రధాన సూత్రధారి ఎమ్మెల్యే అనుచరుడు? 7

యురేనియం తవ్వకాలు ఆపేస్తున్నాం

స్పష్టం చేసిన కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో యురేనియం తవ్వకాలకు సంబంధించిన అన్ని చర్యలను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్ రంజిత్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అటవీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఈ నెల 14వ తేదీన ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్‌కు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. యురేనియం బోర్ల తవ్వకాల ప్రతిపాదనలకు సంబంధించి ఇకపై ఏ విధమైన చర్యలు తీసుకోవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భారీగా పత్తి ధర పతనం


విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర భారీగా పతనమైంది. శుక్రవారం పత్తి ధర క్వింటం రూ.7099 పడి పోయింది. కనిష్ఠ ధర రూ.3969, మధ్యస్థ ధర రూ.6889 పలికింది. గత వారంతో పోల్చితే క్వింటానికి రూ.400పైగా తగ్గింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే మార్కెట్‌లో వ్యాపారులు తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కొనుగోలు చేస్తున్నప్పటికీ పత్తి ధరల పెరుగుదలలో మార్పు రాలేదని రైతులు వాపోతున్నారు. పత్తి గింజల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పతనం కావడం వల్ల స్థానిక మార్కెట్‌లో ధరలు తగ్గాయని వ్యాపారులు తెలిపారు. కాగా 3544 క్వింటాళ్ల పత్తి విక్రయానికి వచ్చింది.

శని, ఆదివారాల్లో పత్తి కొనుగోలు ఉండదు

ప్రతి శని, ఆదివారం సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు ఉండదని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. సీసీఐకి విక్రయించుకునేందుకు ముందుగానే పేర్లు నమోదు చేసుకున్న రైతులు ఇది గమనించాలని సూచించారు. సీసీఐ కేంద్ర నిర్వాహకులే ఫోన్ ద్వారా తెలియజేసినప్పుడే విక్రయానికి పత్తి తీసుకురావాలని తెలిపారు.





విదేశీ ద్రవ్య నోట్ల సేకరణ



విదేశీ కరెన్సీ నాణేల సేకరణ



తంజావూరులోని బృహదీశ్వరాలయం వెయ్యేళ్లు పుర స్కరించుకుని రూపొందించిన వెయ్యి రూపాయల నాణేం



ఆర్బీఐ అరుదుగా ముద్రించిన రూ.150, రూ.1000 నాణేలు



- అరుదైన నాణేలు, నోట్ల సేకరణ
- 33 ఏళ్లుగా కొనసాగుతున్న అలవాటు
- ఓ వ్యాపారి ఆసక్తికర హాబీ
- భవిష్యత్ తరాలకు తెలియజేయడానికే అంటున్న వినోద్



వినోద్‌కుమార్, కరెన్సీ సేకరణ కర్త



సేకరించిన విదేశీ ద్రవ్య నోట్లు

ఆయన ఇల్లు.. కరెన్సీ మ్యూజియం..!

ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అలవాటు ఉంటుంది. దినచర్యలోనైనా, జీవన శైలిలోనైనా కొందరు తమ ప్రత్యేకతను చాటుకుంటూ ఉంటారు. కొందరికి ఉదయం లేచిన వెంటనే వాకింగ్ వెళ్లాలని, మరికొందరికి క్రీడలు ఆడాలని, ఇంకొందరికి పరుగెత్తాలనే అలవాట్లు ఉంటాయి. చాలా అరుదుగా కొందరు స్టాంప్‌లు, కరెన్సీ నోట్లు, నాణేల సేకరణపై మక్కువ చూపుతారు. దేశ విదేశాలకు చెందిన స్టాంప్‌లను, కరెన్సీ నాణేలను పోగుచేసి సంబరపడిపోతుంటారు. సేకరణ పెరిగే కొద్ది ఆనందపడుతూ.. తమ అలవాటును కొనసాగిస్తుంటారు. ఈ కోవలోనే ఆత్మకూరు పట్టణానికి చెందిన వినోద్‌కుమార్ అనే వ్యక్తి కరెన్సీ నాణేలు, ద్రవ్య నోట్ల సేకరణకై ఎంతో కష్టపడ్డారని చెప్పవచ్చు. 33 ఏళ్లుగా ఎంతో పట్టుదలతో నాణేలను, ద్రవ్యనోట్లను సేకరించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు. సాధారణంగా లభ్యమయ్యే కరెన్సీనే కాకుండా వందల సంఖ్యలో అరుదైన కరెన్సీ నోట్లను, నాణేలను సేకరించి గత చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు విశేష కృషి చేస్తున్నారు.




రాజుల కాలం నాటి పురాతన నాణేలు

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణానికి చెందిన దేవరశెట్టి రామసుబ్బయ్య, కృష్ణవేణమ్మ దంపతుల కుమారుడైన వినోద్‌కుమార్ డీ-ఫార్మసీ పూర్తి చేసి మెడికల్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. తన దుకాణానికి వచ్చే అరుదైన కరెన్సీ నోట్లను సేకరించడంతో బంధువులు, కుటుంబసభ్యుల సహకారం వల్ల అరుదైన కరెన్సీ సేకరణకు అలవాటు పడ్డారు. అంతేకాకుండా హంపీ, ధర్మస్థల, మైసూర్, హలిబీడ్, తంజావూర్ తదితర పర్యాటక ప్రదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ లభించే అరుదైన కరెన్సీని కొనుగోలు చేసి మరీ దాచుకునేవారు. 1992లో కర్నూలులోని ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సమయంలో ఆయన గురువు సాంబశివరావు సూచనలతో ప్రారంభించిన కరెన్సీ సేకరణ నేటికీ ముమ్మరంగా సాగుతోంది. భారతదేశ చరిత్రలోని కరెన్సీ చలామణిలో అతితక్కువ కరెన్సీ నాణెంగా పేరుగాంచిన బొట్టు నాణెంతో పాటు అణా, దమ్మిడీ, పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు, పదిపైసలు, నుంచి రూ.వెయ్యి కాయిన్ వరకు నాణేలను సేకరించారు. అలాగే ఆయా సంవత్సరంలో రిజర్వు బ్యాంక్ నుంచి విడుదలైన ప్రతి కాయిన్, నోట్లను పోగుచేశారు. భారత్‌లో ఈస్ట్‌ఇండియా కంపెనీ విడుదల చేసిన కరెన్సీ, నిజాం పాలకుల కరెన్సీతో పాటు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ప్రతి కరెన్సీని తన వద్ద పదిలపర్చుకున్నాడు.

అరుదైన కరెన్సీలు ఆయన సొంతం

దేశవిదేశాలకు చెందిన అరుదైన కరెన్సీ నాణేలను వినోద్‌కుమార్ సేకరించారు. ఇండియాతో పాటు నేపాల్, శ్రీలంక, చైనా, జపాన్, సింగపూర్, యుగొస్లోవియా, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఫిలిఫిన్స్, యూరప్, లిబియా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, సౌదీ, అరేబియా, కువైట్, దుబాయ్, అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఉత్తర కొరియా, జర్మనీ, దక్షిణ కొరియా, బంగ్లాదేశ్, భూటాన్, జింబాబ్వే తదితర దేశాలకు చెందిన కరెన్సీ నాణేలను, నోట్లను సేకరించారు. అంతేకాకుండా భారత్‌లో ఈస్ట్ ఇండియా కంపెనీకి ప్రారంభానికి ముందు కొనసాగిన కరెన్సీతో పాటు తర్వాత వచ్చిన కరెన్సీని కూడా సేకరించారు. అలాగే నవాబుల కాలం నాటి అరుదైన ముద్రిత నాణేలను కూడా సేకరించారు. కాగా పలు కరెన్సీ నాణేలు, నోట్ల కోసం లక్షల రూపాయాలు వెచ్చించి కొనుగోలు చేశాడు. కరెన్సీ సేకరణకు భారీ ఖర్చులు చేస్తున్నప్పటికీ వినోద్‌కుమార్ హాబీకి కుటుంబసభ్యుల నుంచి సహకారం అందుతోంది.



కరెన్సీ నాణేలు భద్రపరిచేలా ఆల్బమ్

భవిష్యత్ తరాలకు చరిత్ర చూపించేందుకే...

దేశవిదేశాల్లో చెలామణిలో వున్న పురాతన కరెన్సీ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలన్నదే నా తపన. ఇందుకోసం 33ఏళ్లు పాటు కష్టపడ్డాను. ఇంకా అనేక విదేశీ కరెన్సీని సేకరించాల్సి వుంది. సాధ్యమైనంత వరకు వాటన్నింటిని సేకరిస్తాను. రాబోవు రోజుల్లో ఎప్పుడైె సేకరించిన కరెన్సీ నాణేలు, నోట్లను ప్రదర్శనంగా ఉంచి కరెన్సీ చరిత్రను ప్రజలకు తెలియపర్చాలన్నదే సంకల్పం.

- వినోద్‌కుమార్

ఉల్లి రైతుకు కన్నీళ్లు

(5 పేజీ తరువాయి)



కేపీ ఉల్లి పంటకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. మార్కెటింగ్ సౌకర్యం లేక పోవడంతో పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గత ఐదేళ్ల క్రితం 10 వేల ఎకరాల వరకు పంట సాగు చేసేవారు. అయితే ఇప్పుడు వందల ఎకరాల్లోనే సాగు చేస్తున్నారు. పలు రకాల ఉద్యాన పంటల దిగుబడులను ఎగుమతికి ప్రోత్సహిస్తున్నా ప్రభుత్వం కేపీ ఉల్లిని మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా విదేశాల ఎగుమతిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అప్పుల ఊబిలో కూరుకపోతున్నాం



మూడెకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. గత ఏడాది మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో ఉల్లి సాగు చేశాను. సాగుకు దాదాపు రూ.3 లక్షలు అయింది. అధిక వర్షాలు, తెగుళ్లతో పంట దెబ్బతింది. పంట చేతికొచ్చాక మార్కెట్‌లో ధర లేదు. పంటను కోసి తరలించాలన్నా ఖర్చు అవుతుంది. పెట్టుబడి కూడా రాకపోవడంతో పంటను వదిలేశా.

-సంజీవరెడ్డి, రైతు, కొలుములపేట

ప్రభుత్వం ఆదుకోవాలి



అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల ఉల్లి పంట దెబ్బతినింది. 5 ఎకరాల్లో సాగు చేశా. రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టా. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనపడటం లేదు. అప్పుల ఊబిలో కూరుకపోతున్నాం. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

-సుధాకర్‌రెడ్డి, రైతు, చింతలచెరువు

నష్టాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తాం

కేపీ ఉల్లి పంట అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల దెబ్బతిన్న పంట నష్టం గురించి ప్రభుత్వానికి తెలియజేస్తాం. కేపీ ఉల్లి దిగుబడి తగ్గింది. మిగతా మండలాలతో పోలిస్తే వర్షాల వల్ల చాగలమర్రిలో దిగుబడి తక్కువగానే ఉంది. దిగుబడి రాకపోవడంతో కొందరు రైతులు పంటను దున్నేస్తున్నారు. పంట నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- శ్రీధర్, ఉద్యానశాఖ అధికారి

శ్రీశైలం ఆలయ ఈవోగా చంద్రశేఖర్ ఆజాద్

శ్రీశైలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా తిరుపతి ప్రాంతీయ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం చంద్రశేఖర్ ఆజాద్ శ్రీశైలం దేవస్థానంలో జరుగుతున్న కార్తీకమాసోత్సవాల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిగా ఉన్నారు. దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా కొనసాగుతున్న చంద్రశేఖర్ రెడ్డిని ఇన్‌చార్జి ఈవో బాధ్యతల నుంచి రిలీవ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నవనందులకు పాదయాత్ర



నవనందుల ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్న రాధామనోహర్‌దాస్ స్వామిజీ, కమలానందభారతీ స్వామీజీ తదితరులు

నంద్యాల కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నవనందుల క్షేత్రాలకు పాదయాత్ర నంద్యాలలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్‌దాస్ స్వామిజీ, కమలానంద భారతీ స్వామిజీలు పాల్గొని పాదయాత్రను ప్రారంభించారు. నంద్యాల ప్రథమ నందీశ్వరాలయం నుంచి పాదయాత్రగా భక్తులు బయలు దేరి పట్టణంలోని నాగనంది, సోమనందిలను దర్శించుకున్నారు. అక్కడి నుంచి మిగతా నంది క్షేత్రాలకు పాదయాత్రగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, చలంబాబు, కాశీఅన్నపూర్ణ ఆర్యవైశ్యసత్రసముదాయాల అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కర్నూలుకు చెందిన ఎం.శ్రీరామయ్య అనే భక్తుడు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు చెక్కును ఆలయ పర్యవేక్షకులు టి.హిమబిందుకు ఇచ్చారు. ఈ సందర్భంగా దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.



స్వామి, అమ్మవార్ల చిత్రపటాలతో దాతలు

మహానందిలో కోటి దీపోత్సవం

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- జ్వాలా తోరణం వెలిగించిన కలెక్టర్

మహానంది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా కోటి దీపోత్సవం నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో అర్చకులు ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. జ్వాలాతోరణంతోపాటు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా కళావేదిక మండపం వద్దకు తీసుకొచ్చారు. కోటి దీపోత్సవానికి హాజరైన కలెక్టర్ రాజకుమారి చేత ఆలయం ముందు ఏర్పాటు చేసిన జ్వాలా తోరణాన్ని భక్తి శ్రద్ధలతో వెలిగించారు. దీంతో ఆలయం ముందు భాగం దేదీప్యమానంగా వెలుగొందింది. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో కోటి దీపోత్సవం వేదమంత్రాలతో నిర్వహించారు. దీంతో మహానంది ఆలయ పరిసరాలు ఒక వైపు చంద్రుని పౌర్ణమి వెలుగులు, మరోవైపు కార్తీక కోటి దీపకాంతుల మధ్య దేదీప్యమానంగా వెలుగొందాయి. హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, విజయ దంపతులతో పాటు మండల తహసీల్దార్ రమాదేవి, ఏఈఓ ఎర్రమల్ల మధు పాల్గొన్నారు.



మహానందిలో కోటి దీపోత్సవం



మహానంది కోటిదీపోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి


వైభవంగా తుంగా హారతి

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య తుంగా హారతి రమణీయంగా సాగింది. శుక్రవారం రాత్రి కార్తీక పౌర్ణమి శుభ సందర్భాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తుంగా నది ఒడ్డునవీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ప్రహ్లాదరాయలకు పూజలు చేసి హారతులు ఇచ్చారు.



ప్రహ్లాదరాయలకు పూజలు చేస్తున్న పీఠాధిపతి

పీఠాధిపతి తుంగభద్రమ్మకు చీర, కుంకుమ ఇచ్చి పూజలు చేశారు. అనంతరం హారతులు ఇచ్చి కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం శ్రీమఠం పండితులు ప్రత్యేక వేదికపై తుంగా హారతి ఇచ్చిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేశ నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులతో నదీతీరం పులకరించింది. నది ఒడ్డున భక్తులు, మహిళలు, దాససాహిత్య భజన మండలి సభ్యులు లక్ష దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీమఠం ఊంజల మంటపంలో పీఠాధిపతి జ్వాలా తోరణం చేసి భక్తులకు శేషవస్త్రం, ఫల,పుష్ప,మంత్రాక్షితలు ఇచ్చిఆశీర్వాదిం చారు. ఈ కార్యక్రమంలో మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతాచార్, అసిస్టెంట్ మేనేజర్లు ఐపీ నరసింహమూర్తి, శ్రీమఠం ఎస్టేట్ అధికారి బీ.శ్రీనివాసరావు, వాదిరాజాచార్ పాల్గొన్నారు.



తుంగా హారతి ఇస్తున్న పండితులు

గిరిజనుల పోరాట స్ఫూర్తి బిర్సా ముండా



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ పరిపాలకులను వ్యతిరేకంగా పోరాడిన గిరిజన స్వాతంత్ర సమరయోధుడు బిర్సా ముండా స్ఫూర్తి నిలిచి ఉంటుందని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. శుకవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బిర్సా ముండా జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యుక్త వయసులోనే ఆదివాసుల హక్కుల కోసం బీర్సాముండా ఉద్యమించారన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

ఆస్పరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన షేక్ జాకీర్ బాషా (34) అప్పుబాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం సీఐ తెలిపిన మేర కు.. షేక్ జాకీర్ బాషాకు రూ.5లక్షలు అప్పు ఉందంటూ రోజూ బాధపడేవాడు. అక్టోబరు 26వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య సుభాన్ బీ. కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

నీటి ట్యాంకులో పడి యువతి మృతి

ఎమ్మిగనూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కలుగొట్ల పొలాల్లోని నీటి ట్యాంకులో పడి ఓ యువతి (31) శుక్రవారం మృతి చెందింది. కలుగొట్లకు చెందిన జయలక్ష్మి ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఓ రైతు పొలంలో పైరుకు మందు పిచికారీ చేసింది. అనంతరం చేతులను నీటి ట్యాంకులో కడుక్కునేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయింది. ఈత రాకపోవటంతో నీటిలో మునిగి మృతి చెందింది. కూలి పనులకు వెళ్లిన కూతురు సాయంత్రమైనా ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు పొలం దగ్గరకు వెళ్లి చూడగా నీటి ట్యాంకులో శవమై కనిపించింది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. కాగా ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని రూరల్ పోలీసు తెలిపారు.

గుండెపోటుతో కౌలు రైతు మృతి

పత్తికొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన కౌలు రైతు వెంకటేశ్వర్లు(57) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం పొలానికి వెళ్లిన ఆయనకు గుండె పోటు రావడంతో పొలంలో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన పత్తికొండ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా వెంకటేశ్వర్లుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బియ్యం లారీ పట్టివేత



బియ్యం స్వాధీనం చేసుకున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు తరలిపోతున్న బియ్యం లారీని మండలంలోని మాధవరం చెక్‌పోస్ట్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. రాయచూరుకు చెందిన భరత్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని ఆదోని నుంచి రాయచూరుకు తరలిస్తుండగా చెక్‌పోస్ట్ ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌నాయుడు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లారీ బియ్యంతో సహా డ్రైవర్ శ్రీకాంత్‌ను మాధవరం పోలీసులకు అప్పగించారు. మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో 200 బస్తాల్లోని 80 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదాం, వీఆర్‌వో నర్సప్ప, వీఆర్ఏ పంపాపతిలతో పంచనామా నిర్వహించి రెవెన్యూ అధికారులకు బియ్యాన్ని అప్పగించారు. వాటిని ఎమ్మిగనూరు గోడంకు తరలించారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యం వెనుక ఎవరున్నారనేది త్వరలో తేలుస్తామని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది వీరేష్, వీరాంజనేయులు, రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్



రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

- ఎమ్మెల్యే అనుచరుడని గుర్తింపు?
- కర్ణాటకకు తరలిస్తూ, మాధవరం వద్ద పట్టుబడిన వాహనం
- ఆదోని గోడౌన్‌లోని బియ్యం నిలువలు సీజ్

ఆదోని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదోని నుంచి రాయచూరుకు పెద్ద లారీలో తరలిస్తున్న దాదాపు 13 టన్నుల అక్రమ బియ్యాన్ని శుక్రవారం ఉదయం మాధవరం చెక్‌పోస్టు వద్ద పోలీసు అధికారులు పట్టుకున్నారు. ఈ బియ్యం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ప్రధాన అనుచరుడు, బీజేపీ యువ నాయకుడివని సమాచారం. ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడి బియ్యం దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నదనే ఆరోపణలన్నాయి. నివారించాల్సిన ఎమ్మెల్యే మౌనం దాల్చడంతో పాటు, ఓ పోలీస్ స్టేషన్ సీఐ అండదండలు పుష్కలంగా ఉండటంతో, ఈ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి ఆస్పరి ప్రధాన రహదారిలో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు సమాచారం వచ్చింది. ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. అయితే ఈ విషయాన్ని కొందరు రెవెన్యూ అధికారులు బియ్యం అక్రమార్కుడికి ముందుగానే సమాచారం ఇవ్వడంతో, అధికారులు బియ్యం అక్రమ నిలువల స్థావరానికి వెళ్లే లోపే, అక్కడి నుంచి బియ్యం లారీలతో పాటు నిందితులు జారుకున్నారు. ఆ తర్వాత శుక్రవారం రాయచూర్ తరలిస్తున్నరని తెలియడంతో అధికారులు అప్రమత్తమై స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత తెలిసిన సమాచారం మేరకు భాస్కర్ రెడ్డి కాలనీలో ఓ ఇంట్లో సదరు బీజేపీ యువ నాయకుడికి సంబంధించిన బియ్యం నిలువలు ఉంచారని శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో సబ్ కలెక్టర్‌కు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు తహసీల్దార్ శివరాముడు, సీఎస్‌డీటీ వలిబాషా, రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ ఖాసీం, వీఆర్వోలు రాజశేఖర్ గౌడ్, అంజనేయులు దాడులు నిర్వహించి, దాదాపు 40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ వలిబాషా తెలిపారు

లోకాయుక్త, హెచ్‌ఆర్సీని కర్నూలులోనే కొనసాగించాలి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- ఎంపీ బస్తిపాటికి ఆర్పీఎస్ వినతి

కర్నూలు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవహక్కుల కమిషన్ కార్యాలయం, లోకాయుక్త కార్యాలయాలు కర్నూలులోనే కొనసాగించాలని ఆర్వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజుకు రాయలసీమ విద్యార్థి పోరాట సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఎన్నో పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వంలో రాష్ట్ర మానవహక్కుల కమిషన్ కార్యాల యం, లోకాయుక్త కార్యాలయాలు కర్నూలులో ఏర్పాటు చేశారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని అమరా వతికి తరలించడానికి ప్రయత్నాలు చేస్తోందని, కర్నూలులోనే కొనసాగించేలా సీఎం చంద్రబా బుకు తెలియజేయాలని ఎంపీని కోరారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో రాష్ట్ర రాజధాని ఏర్పాటు చేయాల్సి ఉన్నా ప్రభుత్వాలు అమరావతి, వైజాగ్, అంటూ రాయలసీమను పూర్తిగా విస్మరించాయని విమర్శించారు. పూర్తిగా వెనుక బడిన రాయలసీమ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని అన్నారు. కర్నూలులో ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కార్యాలయాలను అమరావతికి తరలించ డాన్ని నిలిపివే యాలని కోరారు. ఈ కార్యాల యాలు కర్నూలులో ఏర్పాటు చేయడం చట్టవి రుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోర్టులను కోరిన డాక్టర్ మద్దిపాటి శైలజపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న, మదాసీ కురువ ప్రకాష్, కే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కర్నూలులోనే..

హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి: మంత్రి టీజీ భరత్



కర్నూలు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త సంస్థ, మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) కర్నూల్లోనే ఉంటాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర రాజధానిలో మంత్రి మాట్లాడుతూ కర్నూల్లో ఇప్పటికే నెలకొల్పిన సంస్థలు ఏవీ ఇక్కడి నుంచి తరలించబోమని తెలిపారు. ఈ విషయంపై మంత్రి నారా లోకేష్‌తో చర్చించినట్లు తెలిపారు. ఈ సంస్థలన్నీ కర్నూల్లోనే ఉంటాయని హామీ ఇస్తున్నాని తెలిపారు. ప్రజలెవ్వరూ ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హైకోర్టు బెంచ్ కర్నూల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల తరలింపును అడ్డుకుంటాం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



కర్నూలు న్యూసిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): లోకాయుక్త, హ్యూమన్ రైట్స్ కమి షనర్ కార్యాలయాలను కర్నూలు నుంచి అమరావతికి తరలించడాన్ని అడ్డుకుంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఇక్కడి ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు న్యాయం రాజధాని ఏర్పాటులో భాగంగా లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఏసీబీ కోర్టును ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రాయలసీమపై సవత తల్లి ప్రేమ చూపిస్తూ వాటిని అమరావతికి తరలించాలని నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఇదే జరిగితే రాయలసీమ వాసులుగా తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక నాయకులు

ఆ కార్యాలయాలను కర్నూలులోనే ఉంచాలి

కర్నూలు కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సందర్భంగా కర్నూలులో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యాల యాలను ఇక్కడే కొనసాగించాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు రాష్ట్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో వారు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలులో ఏర్పాటు చేసిన వక్ఫ్ బోర్డు కార్యాలయం, లోకాయుక్త రాష్ట్ర కార్యాలయం, మానవ హక్కుల కమిషన్, జాతీయ న్యాయ విద్యా కళాశాల తదితర రాష్ట్రస్థాయి కార్యాలయాలను అమరా వతికి తరలించాలని నిర్ణయం తీసుకోవడం సరైంది కాదని అన్నారు. ఏపీ రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు పశ్చిమ ప్రాంతంలోని వలసలను నివారించి, అభివృద్ధి చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర హైకోర్టును, కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీమ విద్యావంతుల వేదిక భాస్కర్‌రెడ్డి, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి శేషాద్రి రెడ్డి, కేఎస్‌పీఎస్ బాధ్యుడు సుబ్బరాయుడు, డీటీఎఫ్ బాధ్యుడు రత్నం ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

- ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన





వరుడి ఇంటి ముందు బైఠాయించిన యువతి, ప్రియుడు ఈశ్వర్ ప్రసాద్‌తో యువతి

ఆదోని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. కర్ణాటక రాష్ట్రం మైసూరు ప్రాంతానికి చెందిన యువతి చందన మంజునాథ్ బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తోంది. అదే కంపెనీలోనే ఆదోని పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన బుగ్గే నాగరాజు, నాగవేణి దంపతుల కుమారుడు గురు ఈశ్వర్ ప్రసాద్ పని చేస్తున్నాడు. ఒకే కంపెనీలో పని చేస్తున్న వీరిద్దరు ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు ఆమోదం తెలపడంతో 40 తులాల బంగారం తోపాటు మరికొంత నగదు కట్న కానుకల కింద మాట్లాడు కున్నారు. నవంబరు 14న నిశ్చితార్థం, డిసెంబరు 6న పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి వస్తానని గురు ఈశ్వర్ ప్రసాద్ ఆదోనికి వచ్చి ఇక్కడే ఉండిపోయాడు. తిరిగి రాకపోవడంతో యువతి వారం కిందట అబ్బాయి ఇంటికి చేరుకొని వారితోనే ఉంటోంది. అయితే గురువారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో తల్లిదండ్రులతో కలిసి గురు ఈశ్వర్‌ప్రసాద్ ఉడాయించాడు. సదరు యువతి ఉదయం లేచి చూసే సరికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో నష్టపోయానని గ్రహించింది. తనకు న్యాయం చేయాలంటూ గురు ఈశ్వర్‌ప్రసాద్ ఇంటి ముందే బైఠాయించింది. కొంతమంది మహిళలు మద్దతు తెలిపి డీఎస్పీ సోమన్నను కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనను ప్రేమించిన అబ్బాయితోనే పెళ్లి చేసి న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులను కోరింది. అయితే పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయలేదు.

అమేజ్ లైఫ్ కేసు దర్యాప్తు వేగవంతం

- ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమేజ్ లైఫ్ పి.ప్యాకెట్ ఆన్‌లైన్ సర్వీసు స్కీమ్ పేరుతో జరిగిన మోసం కేసులో దర్యాప్తు వేగవంతం చేశామని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. మంత్రాలయం మండలం, మాధవరం గ్రామానికి చెందిన నాగిరెడ్డి అనే వ్యక్తి ఈ స్కీములో రూ.13 లక్షలు డిపాజిట్ చేసి మోసపోవడంతో పోలీసులను ఆశ్రయించాడని వెల్లడించారు. ఈ స్కీములో డబ్బులు డిపాజిట్ చేస్తే 9 నెలల్లో రెట్టింపు అవుతాయని నిర్వాహకులు నమ్మించడంతో సుమారు మూడు వేల మందికి పైగా బాధి తులు డిపాజిట్ చేసి మోసపోయారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేసేందుకు ఎమ్మిగనూరు, మంత్రాలయం సీఐలతో పాటు మాధవరం ఎస్ఐ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని 60 మంది బాధితులను మోసం చేసిన ఘటన కూడా ఇటీవల జరిగిందని, వారి బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు.

ఎల్లెల్సీలో పడి మహిళ మృతి



రేణుక మృతదేహం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీలో పడి వనపర్తికి చెందిన రేణుక (27) అనే మహిళ మృతి చెందింది. వనపర్తికి చెందిన రేణుక, బాలరాజు మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు నుంచి ఆదోనికి పోవు దారిలో ఎల్లెల్సీ దగ్గర ఆటో నిలిపి కాళ్లు, మొహం కడుక్కుంటుండగా రేణుక కాళ్లు జారి పడిపోయింది. దీంతో అక్కడే ఉన్న కొంత మంది యువకులు ఆమెను బయటకు తీశారు. బాలరాజు ఆటోలో ఆసుపత్రికి తీసుకువస్తుండ గా మార్గం మధ్యలోనే చనిపోయింది. రేణుకకు ఇద్దరు పిల్లలు ఉండగా భర్త మూడేళ్ల కిందట మరణించారు. పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆదివాసుల సమగ్రాభివృద్ధే ఎన్డీఏ లక్ష్యం

- పీఎం జన్‌మన్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- కొట్టాలచెరువులో ప్రత్యక్ష ప్రసార సభను వీక్షించిన జిల్లా అధికారులు
- సభలో చెంచు మహిళా సర్పంచ్‌కు అవమానం



మోదీ ప్రసంగం సమయంలో సెల్‌ఫోన్లలో బిజీగా అధికారులు



వెనుక వరుసలో కూర్చున్న గిరిజన సర్పంచ్

ఆత్మకూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసుల సమగ్రాభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని భారత ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బిహార్ రాష్ట్రంలోని జముయి జిల్లాలో రూ.6640 కోట్లతో పలు అభివృద్ధి ప్రాజెక్టలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని దేశంలోని అన్ని ఆదివాసీ ప్రాంతాల్లో అధికారులతో పాటు ఆదివాసులు వీక్షించేలా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువులో ఏర్పాటు చేసిన వర్చ్యువల్ సదస్సుకు శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట శివప్రసాద్, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య తదితరులు హాజరయ్యారు.

అధికారుల అలసత్వం, గిరిజన సర్పంచ్‌కు అవమానం : ఐటీడీఏ అధికారులు కొట్టాలచెరువులోని కొంతమంది గిరిజనులతో పాటు వివిధ శాఖల అధికారులు, సచివా లయ సిబ్బందిని, పాఠశాల విద్యార్థులను కార్యక్రమాన్ని మమ అనిపించారు. కలెక్టర్ రాజకుమారి పర్యటన చివరి క్షణాల్లో రద్దయింది. ఇదే అదునుగా అక్కడికి వచ్చిన చాలా మంది జిల్లా, మండల స్థాయి అధికారులు సభలో కూచోకుండా తమ కార్లలో కుర్చొని సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేస్తూ కనిపించారు. సభకు హాజరైన కొట్టాలచెరువు గ్రామ గిరిజన సర్పంచ్ నాగలక్ష్మిని కనీసం పట్టించు కోలేదు. ఆమెకు తొలుత మొదటి వరుసలో కుర్చీ ఉంచిన ప్పటికీ అధికారులు రాగానే ఆమె వెనక వరసలోకి వెళ్లాల్సి వచ్చింది. గిరిజన సర్పంచ్‌ను అవమానించడంపై గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహంతో అధికారులను నిలదీ శారు శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి వారిని సర్దిచె ప్పారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

నందవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాగలదిన్నె దగ్గర తుంగభద్ర నదిలో రీచ్ లేకున్నా కొంతమంది అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని అన్నారు. దీంతో దాడులు చేసి ఏడు ఇసుక ట్రాక్టరు పట్టుకున్నామని చెప్పారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్



పీఠాధిపతితో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్

మంత్రాలయం, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రాజశేఖర్‌రావు సతీసమేతంగా శుక్రవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహా ముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తిలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. వీరి వెంట ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేశ్ గులాటీ, ఆర్ఎం శ్రీనివాస్, మంత్రాలయం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ వి.రాజశేఖర్, రామచంద్రనాయక్, కృష్ణవేణి, ఉరుకుందమ్మ అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జగన్నాథం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్లులేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాలలో ఆటో మైకు ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్నాథం మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతాలలో మూడు సెంట్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. పేదలకు 2 సెంట్లు స్థలం ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి, నగర కార్యవర్గస భ్యులు నాగరాజు, అన్వర్, ఆశాబేగం, నాగేశమ్మ, సోఫియా పాల్గొన్నారు.

పెన్షన్ ప్రతిపాదన గడువు పెంచొద్దు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సర్వీస్, ఫ్యామిలీ పెన్షన్ ప్రతిపాదన గడు వును 45 రోజుల నుంచి 90 రోజులకు, 90 రోజుల నుంచి 120 రోజులకు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, మనోహర్, సుబ్బరాయుడు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ ప్రతిపాదనను వెంటనే విరమిం చుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లూరు మండలంలోని పందిపాడు, లక్ష్మీపురం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి సమస్యలను తెలుసుకు న్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న కుటుం బాలలో పిల్లల చదువులు, వివాహాల అవసరాలు ఉంటాయన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్న ఉద్యోగులపై ప్రభుత్వం చల్లగా నీలుచల్లిందన్నారు. అలాగే యాప్‌ల భారం తగ్గించాలని, అపార్ పేరుతో ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఆదనపు భారం మోపిందని అన్నారు.

నదీతీర ప్రాంతాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నదీతీర ప్రాంతాలు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు హంద్రీ, తుంగభద్ర చుట్టూ అక్రమ నిర్మాణాలు తొలగించాలని, నదులు చుట్టూ ఉన్న స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు కర్నూలు ఆర్‌డీఓ సందీప్ కుమార్ బృందాలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో రెవెన్యూ విభాగంతోపాటు నగర పాలక సంస్థ పరిధి లోని నలుగురు ప్లానింగ్ సెక్రటరీలకు విధులు కేటాయించారు. వీరంతా జొహరాపురం హంద్రీ నుంచి పందిపాడు వరకు నదీతీర ప్రాంతాలలో పర్యటించి అన్యాక్రాంతమైన స్థలాలను సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పూడికతీతలో జాప్యం వహిస్తే చర్యలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలలో చేపడుతున్న పూడికతీత పనుల్లో జాప్యం వహిస్తే చర్యలు తప్పవని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు కార్మికులను హెచ్చ రించారు. శుక్రవారం 39,40 వార్డులలోని స్టాంటాన్‌పురం, షాజహాన్ నగర్, కొండారెడ్డి నగర్ తదితర ప్రాంతాలలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలు వలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ గిరి రాజు, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజు, ట్రైనీ ఏఈ ఖాసీంవలి పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కర్నూలు కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో కార్తీక పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కర్నూలు కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఘాట్‌కు ఇరువైపులా విద్యుద్దీపాలతో అలంకరించారు. మైక్‌ల ద్వారా ఘాట్ వద్ద జరుగుతున్న కార్యక్రమాలను ప్రసారం చేశారు. సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభించి, 6 గంటలకు వినాయక మందిరం నుంచి కేసీ కెనాల్ వినాయక ఘాట్ వరకు శివపార్వతుల విగ్రహాలతో రథయాత్ర నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ధ్వజారోహణ ఆకాశజ్యోతి, జ్యోతి ప్రజ్వనతో లక్ష దీపోత్సవాలు ప్రారంభించారు. సాయంత్రం 7 గంటలకు మామిళ్లపల్లి నాగఫణిశాస్త్రి బృందం ఆధ్వర్యంలో తుంగభద్రమ్మ నదికి తుంగా హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డాక్టర్ బి. నవ్య, ట్రైనీ కలెక్టర్ కల్యాణి, నగర మేయర్ బీవై రామయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ ఎస్‌వీ విజయమనోహరి, దీపోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.పద్మావతమ్మ, రాధిక పాల్గొన్నారు.

● నగరంలోని వివిధ ఆలయాల్లో కార్తీక దీపోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించి, జ్వాలా తోరణం, దీపోత్సవం, సామూహిక మంగళ హారతులు నిర్వహించారు. అశోక్ నగర్ లోని అభయాంజనేయ స్వామి, ద్వారకామయి ఆలయంలో దీపోత్సవాలు చేపట్టారు. పాత నగరంలోని శివాలయంలో, షిరిడీ సాయిబాబా ఆలయాల్లో, నెహ్రూ రోడ్డులోని సత్యసాయి మందిరంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై దీపోత్సవాలు నిర్వహించారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఓర్వకల్లులోని జీవేశ్వర స్వామి ఆలయంలో శృంగేరి ఉభయ జగద్గురువుల ఆశీర్వాదంతో రుగ్వేద, జ్యోతిష్య విద్యాంసులు విరివింటి ఫణి శశాంకశర్మ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన, దీపోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ దంపతులు హాజరై శివునికి ప్రత్యేక పూజలు జరిపించి కార్తీక దీపాలు వెలిగించారు. ఏడో అదనపు జిల్లా న్యాయాధికారి జి.భూపాల్‌రెడ్డి దంపతులు, నంద్యాల జిల్లా డ్వామా పీడీ భాస్కర్‌నాయుడు స్వామివార్లను దర్శించుకున్నారు. పొదుపు లక్ష్మి మండల ఐక్య సంఘం గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో మద్దిలేటి, ప్రధానార్చకులు కళ్లె లక్ష్మీనారాయణశర్మ, కళ్లె లక్ష్మీనరసింహాశర్మ భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించారు.

కోడుమూరు రూరల్: మండలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. లద్దగిరి రామలింగేశ్వరస్వామి, ప్యాలకుర్తి భీమలింగేశ్వరస్వామి, వర్కూరు సిద్దేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజామునే పంచామృతాభిషేకం, పుష్ప, బిల్వార్చనలు నిర్వహించారు. లద్దగిరి రామలింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, కోట్ల కవితమ్మ, కోట్ల మంజుల, కోట్ల భానుశ్రీ ముందుగా హంద్రీనదిలో కార్తీక దీపాలు వదిలారు.

సి.బెళగల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించు కుని మండలంలోని క్రిష్ణదొడ్డి, పోలకల్లు, కొత్తకోట గుండ్రేవుల, సంగాల, బురాన్‌దొడ్డి గ్రామాలలో వెలసిన ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.



గంగా హారతి ఇస్తున్న అర్చకులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, టీజీ వెంకటేశ్ తదితరులు



ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి ఆలయంలో మల్లెల రాజశేఖర్



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



పూజల్లో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ తదితరులు



లద్దగిరిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న కోట్ల సుజాతమ్మ



తులసి పూజ





కర్నూలులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



భక్తులతో కిక్కిరిసిన వినాయఘాట్

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు : కమిషనర్

కర్నూలు కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలు అని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్ర బాబు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండోరోజు శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన, పురాతన నాణెముల ప్రదర్శనల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విభిన్న పుస్తకాలను ఆయన పరిశీలించారు. అలాగే పురాతన నాణెములను దర్శిం చి, వాటి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ మాట్లాడుతూ నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి మంచి పుస్తకాలు పఠనం చేయడం వల్ల విజ్ఞానం వికసిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కమిషనర్‌ను మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే ప్రకాశ్‌లు సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్ బాషా, విశ్రాంత ఇంజినీర్ ముచ్చుకోట చంద్రశేఖర్, నిఖిలేష్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మద్దిలేటి పాల్గొన్నారు.



కమిషనర్‌ను సత్కరిస్తున్న కేసీ కల్కూర, ప్రకాశ్ తదితరులు

24న బ్రాహ్మణ సంఘం కార్తీక వనభోజనం

కర్నూలు కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో కరపత్రాలు సంఘ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్తీక మాసంలో వనభోజనం చేయడం ఎంతో పుణ్యకార్యమన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు చెరువు దుర్గాప్రసాద్, నాయకులు చల్లా నాగరాజ శర్మ, కంచుగంటల శ్యామసుందరరావు, నాగులవరం రాజశేఖర్, సీఎస్ ప్రసాదరావు, టీవీ రవిచంద్రశర్మ, సుధాకర్‌శర్మ, దేవెళ్ల విజయకుమార్ శర్మ, బిందు, గాయత్రి పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నగర బ్రాహ్మణ సంఘం నాయకులు

బిర్సా ముండా చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జాయింట్ కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సా ముండా చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నవ్య పిలుపునిచ్చారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా గిరిజన శాఖ సంక్షేమ, సాధికారత ఇన్‌చార్జి అధికారి రంగ లక్ష్మీదేవి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. ఇలాంటి గొప్ప వ్యక్తి జయంతిని నవంబరు 15 నుంచి 26వ తేదీ వరకు జనజాతీయ గౌరవ దివస్‌ను నిర్వహించాలని భారత ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు ఏరుకల రాజు, గిరిజన నాయకులు కైలాస్ నాయక్, యోగేష్ నాయక్, కుశలన్న, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానా ఖజానాను అభివృద్ధి చేసుకుందాం

కర్నూలు న్యూసిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బిర్లాగేటు సమీపంలో ఏర్పాటు చేసిన ఖానా ఖజానాను అభివృద్ధి చేసుకుందామని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో లీజుదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానా ఖజానా ప్రారంభిం చనప్పుడు 14 దుకాణాలు ఉండేవని, ప్రస్తుతం 7 మాత్రమే ఉన్నాయని అన్నారు. వాటిని ఎలా అభివృద్ధి చేయాలో సలహాలు ఇవ్వాలని లీజుదారు లను ఆయన కోరారు. అనంతరం లీజుదారులు మాట్లాడుతూ ఖానా ఖజానాకు బటయవైపు చిన్న చిన్న బండ్లు పెట్టుకోవడంతో ఎవ్వరు లోపలికి రావడం లేదన్నారు. దీంతో పాటు వాహనాలను లోపలికి అనుమతించకపోవడంతో బయట నుంచే ప్రజలు వెళ్లిపోతున్నారని అన్నారు. వాహనాల పార్కింగ్ లోపలికి అనుమతిస్తే వ్యాపారాలు బాగా జరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో రెవెన్యూ ఆఫీసర్ జునైద్, సూపరింటెండెంట్ వాజిద్, ఆర్‌ఐలు తిప్పన్న, భార్గవ్, రాజు, లీజుదారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోండి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రాఫిక్ సమస్యకు నియంత్రణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహ దారుల్లో ప్రమాదాలు జరిగే 28 బ్లాక్ స్పాట్లను గుర్తించారని అన్నారు. డోన్, అనంతపుర ం బెంగళూర్ వెళ్ళే బస్సులను రాజ్‌విహార్ బస్‌స్టాండ్ నుంచి ఆపరేట్ చేసే అంశంపై ట్రయల్ రన్ చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎంను ఆదేశించారు. ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ నగరంలోని పని చేయని సీసీ కెమెరాల స్థానంలో హై రిజల్యూషన్ 8 మెగా పిక్సెల్ ఉన్న కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలాపురం, పెంచికలపాడు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు మహేశ్వరరెడ్డి, సుంకన్న సాగు చేసిన పత్తి, కంది పంటలను జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదజని సూచిక, తేమశాతం నేల నాణ్యతను పరిశీలించారు. రసాయనిక ఎరువులు వాడిన పొలంతో పోల్చి చూశారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తేమశాతం ఉండడం, ఉదజని సూచిక 7, పొలం గుల్లబారి ఉన్నట్లు గమనించామన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేలలో నీరు ఇంకే సామర్థ్యం పెరుగుతుందని, రైతులు ప్రకృతి వ్యవసాయం అలవరచుకోవాలని సూచించారు.

● **సీసీఐ కేంద్రం వినియోగించుకోండి:** పెంచికలపాడు వద్ద సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మీ సందర్శించారు. రైతులు తేమశాతం పత్తిలో 8-12 మధ్య ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం చంద్రశేఖర్, ఏఈవో లక్ష్మీనారాయణ, ఐసీఆర్పీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్లస్టర్‌లో పీజీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో పీజీ 2వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమ య్యాయి. శుక్రవారం వర్సిటీలోని పీజీ కళాశాలలో జరుగుతున్న పరీక్షల తీరును ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. 49 మంది దరఖాస్తు కోగా 49మంది హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కోడుమూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు 2 సెంట్లు స్థలం ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని వర్కూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ప్యాలకుర్తిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు క్రిష్ణ తదితరులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాముడు, ముని స్వామి, వీరాంజనేయులు, ఆదిలక్ష్మి, మునెమ్మ, గిడ్డయ్య, రాములమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

డీఈవోకు అభినందనలు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన డీఈవో శ్యామ్యూల్ పాల్‌ను జిల్లా ఏపీఎస్‌ఏపీఈఈ, పీఈటీ సంఘం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జోషఫ్ లక్ష్మయ్య, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ, శ్రీనివాసులు ఆర్గనైజింగ్ కార్యదర్శి కిశోర్, కోశాధికారి శ్రీనివాసులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరాముడు, మహ్మద్ అస్లాం, ఎం.విజయ కుమార్, ఎంఎండీ బాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుం దని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బి.క్యాంప్, ఓల్డ్‌టౌన్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, మిలిటరీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ కోత ఉంటుందని ఏడీఈ రాజేం ద్రబాబు తెలిపారు.

చిన్న పిల్లలకు 4డీ స్క్రీనింగ్ పరీక్షలు

కర్నూలు హస్పిటల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో పిల్లలకు, తల నుంచి పాదాల వరకు ఈనెల 16 నుంచి 4డీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్ భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారని తెలిపారు. ఈ ఆరోగ్యపరీక్షలు చేసేందుకు అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేపడతామని తెలిపారు.

ముగిసిన జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలైన జట్లను జిల్లా ఒలింపిక్ అసోసి యేషన్ అధ్యక్షుడు రామాంజినేయులు ప్రకటించారు. బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో మాంటిస్సోరి ఎ.క్యాంపు విన్నర్స్‌గా, కర్నూలు నగర మున్సిపల్ హైస్కూల్ రన్నర్స్‌గా నెగ్గి కప్పులతో పాటూ వ్యక్తిగత బహుమతులు దక్కించుకున్నారు. త్రోబాల్‌లో విజ్ఞాన పీఠం మొదటి, మాంటిస్సోరి హైస్కూల్ ద్వితీయ స్థానం పొందారు. ఫుట్‌బాల్ బాలుర విభాగంలో మాంటిస్సోరి మొదటి, మున్సిపల్ స్కూల్ ద్వితీయ స్థానం, వాలీబాల్ బాలికల విభాగంలో కల్లూరు జడ్పీ హెచ్‌ఎస్ మొదటి, మాంటిస్సోరి హైస్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు కేజే రెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

అడిషనల్ ఎస్పీగా హుస్సేన్ పీరా



అడిషనల్ ఎస్పీని అభినందిస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్పీగా హుస్సేన్ పీరా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ బిందుమాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 1991 ఎస్‌ఐ బ్యాచ్ కు చెందిన ఈయన ఆలూరు, నందవరం, నంద్యాల, కోడుమూరులలో ఎస్‌ఐగా, రైల్వే, నంద్యాల టూ టౌన్, తాలూక, రైల్వే కోడూరులో సీఐగా పనిచేశారు. 2014లో డీఎస్పీగా పదోన్నతి పొంది కర్నూలు సీసీఎస్, అనం తపురం పీటీసీ, విజిలెన్స్, జమ్మలమడుగులో డీఎస్పీగా పనిచేశారు. ఇటీ వల ఏఎస్పీగా పదోన్నతి పొంది కర్నూలుకు బదిలీపై వచ్చారు.

క్రీడలతోనే ఆరోగ్యం



విజేతలతో డాక్టర్ అమర్నాథరెడ్డి

కర్నూలు హస్పిటల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆర్యోగానికి ఎంతో దోహదపడతాయని సాయి మేఘా మల్టీ స్పెషాలిటీ చిన్న పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సాయి మేఘా మల్టీ స్పెషాలిటీ హస్పిటల్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు జోహరాపురంలో ఏర్పాటు చేసిన బాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు, మెమొంటోలను అందజేశారు కార్యక్రమంలో జేజే షటిల్ క్లబ్ డైరెక్టర్ జాకబ్, కోచ్ హనీఫ్ పాల్గొన్నారు.

కళాశాలలకు భవనాలు నిర్మించాలి



విద్యా మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఆదోని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలకు భవనాలు నిర్మించాలని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐదేళ్లుగా ఆదోని నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, కూటమి హయాంలోనైనా సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా



టీడీపీ సభ్యత్వం అందిస్తున్న మీనాక్షినాయుడు

ఆదోని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రూ.వందతో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షలు బీమాతో వర్తిస్తుందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బావాజీపేటలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. నిరుపేద కుటుంబంలోని వారికి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్య, వైద్యం, ఉపాధికి సాయం అందుతుందన్నారు. మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, బుద్ధారెడ్డి, రామస్వామి, గోనబావి గోపాల్, మల్లికార్జున పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకుడు వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై చార్జీల భారం మోపవద్దన్నారు. అనంతరం డీటీ సుదర్శనంకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు అశోక్, సూరి, కౌలుట్ల పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని విశ్రాంత హెచ్ఎం శారమ్మ అన్నారు. వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులు శారమ్మ, నారాయణపురం ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ, వివేకానందా పాఠశాల ఉపాధ్యాయని సోఫియా ఆఫ్రీన్ మాట్లాడారు.

'టీడీపీతోనే బడుగులకు లబ్ధి'

తుగ్గలి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ నాయకుడు అప్పవేణుగోపాల్, మాజీ సర్పంచ్ శ్రీనివాసులుగౌడ్, ఎంపీపీ తిరుపాలు నాయుడు అన్నారు. శుక్రవారం ఉప్పర్లపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. మనోహర్, లక్ష్మణస్వామి, కంబగిరి, సంగాల కృష్ణ, విశ్వనాథ్, నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

కార్తీక దీపోత్సవం



ఆదోనిలో..

ఆదోని, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రణమండల కొండలో భక్తులు దీపాలను వెలిగించారు. కార్తీక మాస నిత్య ప్రసాదం సేవా సమితి ఆధ్వర్యంలో కొండకు ఇరువైపులా భక్తులు దీపాలను వెలిగించారు. సభ్యులు రామకృష్ణ, వెంకయ్య శెట్టి, సుబ్రహ్మణ్యం శెట్టి, నాగప్ప, అశోక్, లక్ష్మీనారాయణ, విరుపాక్షి, బోయ వెంకటేష్, బోయ వీరేష్, కోదండ పాల్గొన్నారు.

పత్తికొండ: పట్టణంతోపాటు మండల పరిధిలోని శివాలయాల్లో దీపాలు వెలిగించారు. మండగిరి రామలింగేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తారు.

మద్దికెర: మద్దికెర, పెరవలి, బుగ్గసంగమేశ్వరుడి, శివాలయాలలో తెల్లవారుజామునుంచే మహిళలు దీపాలు వెలిగించారు. బుగ్గసంగమేశ్వరుడు, శివలిం గాలు, సుబ్రమణ్యం స్వామి, రంగసాథస్వామి, మద్ద మ్మవ్వ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు విజయప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీపీ నీలకంఠ రాయుడు, వెంకటరాయుడు, నట్రాజ్, దాత రావ రాంజినే యులు ఉన్నారు.

ఆదోని టౌన్: పట్టణంలోని గంగా దేవి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు ఈరన్న, ఆటో వెంకటేష్, కృష్ణ మూర్తి, దుర్గయ్య, దీపక్ పాల్గొన్నారు.

వెల్దుర్తి: పట్టణంలోని శివాలయంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే బ్రహ్మగుండేశ్వరంలో పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య పూజలు నిర్వహించారు. సీఐ మధుసూదనరావు, ఎస్ఐ అశోక్‌లు ఉన్నారు.

దేవనకొండ: మండలంలోని శివాలయాలకు కార్తీకశోభ సంతరించుకుంది. ఉదయం ఆలయాలలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, ప్రత్యేకపూజలు చేశారు.



వెల్దుర్తిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



దేవనకొండ మండలంలో..



ఆదోని రణమండల కొండపై దీపాలు

సీసీ రోడ్డు నాసిరకంగా వేస్తున్నారని ఫిర్యాదు



కాలనీలో జరుగుతున్న సీసీ రహదారి పనులు

మద్దికెర,నవంబరు15(ఆంధ్రజ్యోతి): మద్దికెర సాయి నగర్ కాలనీలో ఉపాధి నిధులతో వేస్తున్న సీసీ రహదారి నాసిరకంగా వేస్తున్నారని కాలనీవాసులు జిల్లా అధికారులకు ఫిర్యాదుచేశారు. వివరాలు.. శుక్రవారం ఆ కాలనీలో రూ.10లక్షల నిధులతో పనులను ప్రారంభించారు. అయితే పనులు జరుగుతున్న సమయంలో పంచాయతీ, ఉపాధి అధికారులు లేరని, 7ఇంచులు వేయాల్సి రోడ్డు 4 ఇంచుల మందంలో వేస్తున్నారని కాలనీవాసులు నేరుగా జిల్లా అధికారులకు ఫిర్యాదుచేశారు. ఉన్నతాధికారులు స్పం దించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈవిషయంపై పీఆర్ ఏఈ విష్ణును వివరణకోరగా నిబంధనలమేరకే సీసీ రహదారి నిర్మిస్తున్నారని, అలా చేయకుంటే కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరుకావన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచులదే పాత్ర

- డీఎల్‌పీవో నూర్జహాన్



సర్పంచులతో అధికారులు

ఆదోని రూరల్ నవంబర 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర అని డీఎల్‌పీవో నూర్జహాన్, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ భవనంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. వలసలను నివారించాలని, అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని అన్నారు.

కమ్యూనిటీ భవనానికి నిధులు ఇవ్వండి



ఎంపీతో మొలగవల్లి టీడీపీ నాయకులు

ఆలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మొలగవల్లి గ్రామంలో వెలసిన కాశిరెడ్డి నాయన ఆలయంలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ బస్తిపాటి నాగరాజును మొలగవల్లి టీడీపీ నాయకులు శుక్రవారం కోరారు. నియోజకవర్గంలో పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఎంపీని కోరినట్లు తెలిపారు. జింకలతో రైతులు నష్టపోతున్నారని దేవరగట్టులో జింకల పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. బెలగంటి హనుమప్ప, కరువ రామాంజినేయులు కిషోర్, హనుమంతు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



బొజ్జమ్మతో టీడీపీ నాయకులు

దేవనకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటానని వాల్మీకి పేడరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. బంటుపల్లి గ్రామానికి చెందని టీడీపీ కార్యకర్తలు బొజ్జమ్మను స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ తనపై నమ్మకం ఉంచి చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందని, కష్టపడిన వారికి టీడీపీలో న్యాయం జరుగుతుందని బొజ్జ అన్నారు. మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, పురుషోత్తంగౌడ్, వీరయ్యగౌడ్, ఉమేష్‌గౌడ్, దొరస్వామి, నూరిగౌడ్ ఉన్నారు.

నిందితులను శిక్షించాలి

ఆదోని టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం కడిదొడ్డిలో విద్యార్థినిపై అత్యాచార యత్నం చేసిన నిందితులకు కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ నూర్ అహమ్మద్ డిమాండ్ చేశారు. గ్రామ అభివృద్ధికి పాటు పడాల్సిన సర్పంచ్ ఇలాంటి అఘాయిత్యాలకు పాలుపడటం విచారకరమన్నారు.

వర్గీకరణ తేల్చాకే నియామకాలు చేపట్టాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ తేల్చాకే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం బైచిగెరి గ్రామంలో కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ ఇన్‌చార్జిగా మాదాసు సందీప్, ఉపాధ్యాక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, కోశాధికారిగా ఈరన్నను ఎన్నుకున్నారు. రాజబాబు, రంగస్వామి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

ఆలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని వ్యకాసం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిద్ధేశ్వర కాలనీలో ఎస్ఎస్ బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వవ నివాసయోగ్యం కానీ ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చిందని అవి పనికిరావన్నారు. ఈనెల 18న సచివాయాల వద్ద ధర్నా నిర్వహించయి, అర్జీలు సమర్పిమన్నారు. రంగన్న, సిద్ధలింగ, రాజు, మారెప్ప, ఉలిగప్ప, ఖాదర్, లక్ష్మీ, తులసి, ఉస్మాన్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై డీఎల్‌పీవో విచారణ

వెల్దుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌కు ఇచ్చిన స్పందన అర్జీలు, లోకాయుక్త పిటిషన్‌లపై శుక్రవారం డీఎల్‌పీవో టి.లక్ష్మి విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో అర్జీదారులను పిలిపించి విచారించారు. సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. పరిపాల నాధికారి గంగాధర్, అప్పుడు పనిచేసిన ఈవోఆర్‌డీ నరసింహులు, జూనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, పంచాయతీ ఇన్‌చార్జి ఈవో నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటరాముడు ఉన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు హనుమంతు డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో ఆశావర్కరలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ నాయకురాలు లక్ష్మీ భారతి, రాజేశ్వరి, గోవిందమ్మ పీహెచ్‌సీ వైద్యాధికారి బాలకృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఎన్నికల ముందు ఆశావర్కర్‌లు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు. ఫిబ్రవరి 2024 ఒపప్పందం ప్రకారం అమలు చేయాలని వారు కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని సర్పంచు అంజినేయ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం బొమ్మనపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఐటీడీపీ కన్వీనర్ ఉశేన్‌పీరా, టీడీపీ నాయకులు మనోజ్‌కుమార్, హనుమంతు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాండి

పత్తికొండ టౌన్, నవంబరు 15: గ్రామ సచివాలయాల దగ్గర ఈనె 18న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కోయనగర్, రామకృష్ణారెడ్డి నగర్ కాలనీల్లో కరపత్రాలను పంపిణి చేశారు. పేదలకు స్థలాల్చిఇ, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కారన్న, నాగేంద్ర, సిద్ధా, కౌలుట్ల, శ్రీరామలు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఇన్‌చార్జి వివక్షపై సర్పంచ్ నిరసన



నిరసన తెలుపుతున్న సర్పంచ్ అరుణదేవి

ఆలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దళిత సర్పంచ్‌నని వివక్ష టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తనపై వివక్ష చూపుతున్నారని ఆలూరు సర్పంచ్ అరుణదేవి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో వీరభద్ర గౌడ్ డౌన్ డౌన్ అంటూ ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ కూడలిలో మోకాళ్లపై రసన తెలిపారు. పంచాయతీలో తన అనుమతి లేకుండా పనులు చేస్తున్నారని తనకు సమాచారం ఇవ్వకుండా అవమానిస్తున్నారని, ప్రటోక్రాల్ పాటించడం లేదని ఆరోపించారు. వలి, మాజీ ఎంపీటీసీ మద్దిలేటి, నాయకులు బెంగళూర్ కిషోర్, మహేష్ పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



తనిఖీ చేస్తున్న కమిషనర్

ఆదోని టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25,26 వార్డుల సచివాలయాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కారయ్యాయని అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్లాను మంజూరు లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని, ఆస్తి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. సిబ్బంది పనితీరుపై ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఉరుకుంద ఈరన్న కొట్టాల వీధ్ది ఉరుకుంద ఈరన్న ఆలయంలో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా ఎమ్మెల్యే విరూపాక్షి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కార్తీకమాసం ఎంతో పవిత్రమాసం అన్నారు. వైసీపీ నాయకులు జట్టప్ప గారి వీరేష్, ఆకుల గుండయ్య, వీరేష్, పాన్ బోయ వీరేష్, కిషోర్ పాల్గొన్నారు.

108 సిబ్బంది సమ్మె నోటీసు

వెల్దుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిగా గుర్తించి ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ 108 ఉద్యోగులు సమ్మె నోటీస్ ఇచ్చారు. జీవో నెం.49 అమలు చేయాలని ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకుగు పైలెట్ ఉస్మాన్ బాషా అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 25 నుంచి సమ్మె చేయనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు సమ్మె నోటీసు అందజేశారు. పైలెట్ యూనిస్ బాషా, ఈఎంటీ ఖాదర్‌బాషా ఉన్నారు.

కేసు నమోదు

ఆదోని రూరల్ నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దిబ్బనకల్లు చెందిన చిన్న మారెప్ప కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండులో అతని వద్ద నుంచి 50 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

అసెంబ్లీకి వెళ్లాలని కోరడంలో తప్పేంటి?

- డబ్బు వసూలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా
- టీడీపీ ఇంచార్జి వీరభద్ర గౌడ్



మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఓట్లు వేసి ఎన్నుకున్న ఎమ్మెల్యే అసెంబ్లీకు వెళ్లి సమస్యలపై వాణి వినిపించాలని కోరడంలో తప్పేంటని ఆలూరు టీడీపీ ఇంచార్జి వీరదభ్ర గౌడ్ ప్రశించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తామని ఎమ్మెల్యే విరూపాక్షి చెప్పుకోవడం సరికాదన్నారు. ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. తాను ఉద్యోగాలకు, రేషన్ డీలర్ల నియామకం, ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరోపణలు నిజమైతే తాను పార్టీకి రాజీనామా చేస్తానని, అలాగే రుజువు చేయకపోతే మీరు పదవికి రాజీనామా చేస్తారా అని సవాలు విసిరారు. మీ పార్టీకి చెందిన కార్యకర్త భార్యకు మోడల్ హాస్టల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం వచ్చిందని నాకు ఎంత డబ్బులు ఇచ్చాడో చెప్పాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కర్ణాటక మద్యం ఏరులై పారినా మీరు ఎందుకు నోరు మెదపలేదన్నారు. పేకాట ఆడిస్తున్నట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో స్వంత మండలంలో పేకాట శిబిరాలు జరుగుతుంటే ఎం చేశావని ప్రశ్నించారు. రోడ్లకు గుంతలు పూడ్చేందుకు రూ.2.30 కోట్లు మంజూరయ్యాయని, మీ స్వంత గ్రామంలో రోడ్లు వేస్తుంటే కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆలూరు సర్పంచ్ అరుణదేవి చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. తిమ్మయ్య, కిష్టప్ప, రవి, అశోక్, నరసప్ప, కొమ్ము రాజు, నారాయణ, కురువ హనుమప్ప, రాము, కిట్టు, గోపి పాల్గొన్నారు .

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌గౌడ్



తుగ్గలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిలు కావొద్దని, ఉద్యోగ సాధనపై శ్రద్ధ చూపా లని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌గౌడ్ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: దొంగతనాలు, ఇళ్లల్లో చోరీలను ఎలా అరికడతారు?

జవాబు: ప్రతి గ్రామంలో రోజూ పోలీసులు బీట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాము. కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. ఊళ్లకు వెళ్లేవారు ఇళ్లలో బంగారు, నగదు ఉంచవద్దని సూచనలు ఇస్తున్నాం.

ప్రశ్న: అసాంఘిక కార్యకలాపాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు: అక్రమ మద్యం, పేకాట, మట్కా, సారాపై నిఘా ఏర్పాటు చేశాము. పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు.

ప్రశ్న: సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: సైబర్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నాం.

ప్రశ్న: ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జవాబు: పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారాన్ని తెలియజేయాలని ఆదేశించారు. వారంలో ఒక రోజు పల్లెనిద్ర నిర్వహిస్తున్నాం. ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: మహిళలపై దాడులను ఎలా అరికడతారు?

జవాబు: ఎవరైనా మహిళలు ఇబ్బందులు పడుతుంటే 9121101128 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చు. ప్రతి స్టేషన్‌లో మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

కోసిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని షిర్డీ సాయిబాబా దేవాలయం, మార్కండేయ స్వామి, ఈశ్వర స్వామి, శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కోసిగిలోని సాయిబాబు ఆలయం 9వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీసాయి దీపోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మార్కండేయ దేవాలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని శివాలయంలో కార్తీక దీపాలను వెలిగించారు.


ముగతిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

గోనెగండ్ల: మండలంలోని గోనెగండ్ల, గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, తదితర గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్లలోని నీలకంఠేశ్వర దేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహా రుద్రాభిషేకం నిర్వహించారు.

పెద్దకడబూరు: మండలంలోని పెద్దకడబూరు, తారాపురం, బసలదొడ్డి, దొడ్డిమేకలతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలు, అమ్మవారి ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి జలాభిషేకం, అమృతాభిషేకం, పుష్పాభిషేకం, మహా మంగళహారతి, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

కౌతాళం: మండలంలో ప్రముఖ దేవాలయాలైన ఉరుకుంద ఈరన్న స్వామి, బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, తుంగాతీరన వెలిసిన మేళిగనూరు రామ లింగేశ్వర దేవాలయాలలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకు న్నారు. ముఖ్యంగా ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో, అర్చకులు స్వామి వారికి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక లక్ష పుష్పార్చన కార్యక్రమం చేపట్టారు. అలాగే శ్రీరామలింగేశ్వర దేవాలయం వద్ద సాయంత్రం కార్తీకదీపోత్సవ కార్యక్ర మంలో మహిళ భక్తులు


కోసిగిలో సాయిబాబా ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు


మార్కండేయ స్వామి ఆలయంలో..

పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు.

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామంలో శుక్రవారం రాత్రి రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి 1016 దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్య భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుని ఆలయం ప్రత్యేక పూజలు చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గోనెగండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్క రించకపోతే కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్‌బాబు, జిల్లా నాయకులు రంగయ్య, కరుణాకర్ అన్నారు. గోనెగండ్లలో బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపి ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయానికి చేరారు. అక్కడ ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను గాలికి వదిలివేసిందన్నారు. ట్రూఅప్ చార్జీల పేరుతో భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. గ్రామాలలో బెల్టుషాపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. గోనెగండ్లలో బస్‌షెల్టర్‌ను పునరుద్ధరించాలని , ప్రయాణికులకు టాయిలెట్‌లు నిర్మించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో మణిమంజరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నబిరసూల్, దండుఖాజా, నరసింహులు,గిరిరాజు, అక్బర్, గోవిందు, బతకన్న, మునెప్ప, వెంకటేశ్వరమ్మ, తిమ్మప్ప, జయన్న, మోహన్, దరగయ్య, రంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోసిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కోసిగి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్న హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పి నేడు విద్యుత్ చార్జీలను ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై భారం మోపుతుందన్నారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ పరుశురాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ రాముడు, నాయకులు వీరేష్, వెంకటేశ్వర్లు, అమీర్, అంజి, రామకృష్ణ, నాగేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి: సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నందవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గురుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ముందు పార్టీ నాయకులు మల్లేష్, దేవపుత్ర ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. తల్లికి వందనం, మహిళలకు రూ. 1500 పథకం కింద ఇస్తానన్న నగదు వెంటనే ఇవ్వాలన్నారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాసు, నరసింహులు, పెద్దయ్య, దేవదాసు, సంతోష్, రవి, కొండన్న పాల్గొన్నారు.

నేడు తిక్కలక్ష్మన్న తాత ఉరుసు

నందవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో శనివారం తిక్కలక్షన్న తాత, బాబుడేల్ సాబ్ ఉరుసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హజ్రత్ పీరసాబ్ తెలిపారు. శుక్రవారం రాత్రి గంథం నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉరుసుకు పక్క గ్రామాలైన ధర్మాపురం, హాలహర్వి, జగ్గాపురం, చిలకలదోన, ఎమ్మిగనూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలను తరలించడం అన్యాయం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి మానవహక్కుల కమిషన్, లోకాయుక్త కార్యాలయాలను తరలించడం సరికాదని, ఆర్‌వీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఖాజా అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం శ్రీబాగ్ ఒప్పందాన్ని తుంగలో తొక్కుతూ హై కోర్టు ఏర్పాటు కాకుండా రాష్ట్ర లోకాయుక్త , రాష్ట్ర మానవహక్కుల కమిషన్ కార్యాలయాలను అమరావతిలో ఏర్పాటు చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇది రాయలసీమకు తీరని అన్యాయం చేయడమేనన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎంఎస్ఎం ఈ టెక్నాలజీ కేంద్రాన్ని సైతం అమరావతిలో ఏర్పాటు చేస్తామని ప్రకటించడం శోచనీయమన్నారు. ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు స్పందించి రాష్ట్ర లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించేలా పోరాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మోహన్, రమణ, రామాంజి, వెంకట్రాముడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌వీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

సహకార ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలో సాగునీటి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు ఎస్ రవి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని మైనర్ ప్రాజెక్టుల కింద కాగ్గల్లు, రాంపురం, మేజర్ ప్రాజెక్టుల కింద మాధవరం, రచ్చుమర్రి, చెట్నహళ్లి, బూదూరు, మాలపల్లి గ్రామాలున్నాయని తెలిపారు. 77 టీసీ మెంబర్లు, 7,071 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 12 టీసీ మెంబర్లకు ఒక అధ్యక్షుడిగా, మైనర్ ప్రాజెక్టు ఆరు టీసీ మెంబర్లకు ఎంపిక జరుగుతుందన్నారు. ఏడు టీసీలకు ఈనెల 21 నుంచి 23 వరకు ఆయా కేంద్రాల్లో మూడు పద్ధతుల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏకాభిప్రాయం, చేతులెత్తడం, స్లిప్పుల ద్వారా రహస్య ఓటింగ్ నిర్వహించడం ద్వారా టీసీ మెంబర్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇప్పటికే పోలింగ్‌కేంద్రాలను సిద్ధం చేశామని అన్నారు. సమావేశంలో డీటీజీకే గురురాజరావు, రవి ప్రసాద్, రాజశేఖర్, చిన్నరాజు, పరమేష్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దారు రవి

మట్కాకు కళ్లెం

● 'ఆంధ్రజ్యోతి' కథనంతో మట్కాబీటర్‌పై దాడులు
● పోలీసులు అదుపులో పలువురు డాన్‌లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మట్కా డాన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలో మట్కా జోరుగా సాగేంది. దాంతో గురువారం ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో శుక్రవారం పోలీసుల దాడులు నిర్వహించారు. జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాలతో కోసిగి సీఐ మంజూనాథ్ ఎస్ఐ చంద్రమోహన్‌లు మండలంలో ఉన్న మట్కా డాన్‌లను రాత్రికి రాత్రే అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. రెండు రోజులుగా మండలంలో మట్కా మాట ఎత్తడం లేదు. ఆయా ప్రాంతాల్లో మట్కా బీటర్లు కనిపించలేదు. దాంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'కి మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

రైతులకు న్యాయం చేయాలి


రైతులతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామసభల్లో రైతుల నుంచి స్వీకరించిన అర్జీలను వేగంతంగా పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. శుక్రవారం కోసిగిలోని పెండేకల్ రెవెన్యూ అధికారులు, అర్జీదారులతో సబ్‌కలెక్టర్ మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో భూవ్యత్యాసాలు, పేర్లు తప్పుగా ఉండే అర్జీలు ఇచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిత్యనందరాజు, డిప్యూటీ తహసీల్దార్ రుద్ర గౌడ్, డివిజనల్ సర్వేయర్ వేణు సూర్య, మండల సర్వేయర్ శ్రీనివాసులు వీఆర్వోలు వీరేష్, బసవ రాజు, వీరేష్, రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మంత్రాలయం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని మాజీ సర్పంచ్ రఘునాథ రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ ఆధ్వర్యంలో రూ. 40లక్షలతో సీసీ రోడ్లు, మురికి కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్లపాలనలో ఒక్క రోడ్డును కూడా బాగు చేయించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలలకే పల్లెపండుగ పేరుతో గ్రామాల్లో రోడ్లు, మురుగుకాల్వ పనులకు శ్రీకారం చుట్టారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై సీఎం చంద్రబాబునాయుడు దృష్టిసారించారని తెలిపారు. కార్యక్రమంలో ఉరుకుందు, భీమి రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధి: ఎంపీడీవో

నందవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చేసుకుందామని ఎంపీడీవో పుల్లయ్య, ఈవోపీఆర్డీ సందీప్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏవో ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కోసం ముందస్తుగా ప్రణాళిక రూపొందించకుని అధికారులు ప్రజాప్రతినిధులు చర్చించాలన్నారు. అలాగే ప్రతి పనికి పంచాయతీ తీర్మానం తప్పని సరిగా ఉండాలన్నారు. సమావేశంలో ఏవో కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ నరసింహులు, ఏపీవో శ్రీనివాసులు, సర్పంచులు ముగతి విరుపాక్షిరెడ్డి, శివన్న, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

నందవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దేది గ్రంథాలయాలేనని లైబ్రరీయన్ శివరామ్‌ప్రసాద్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు జాతీయ నాయకులలో ఒకరు అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

గోనెగండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న లావణ్య అండర్ 19 వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెలలో కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా విషయం తెలుసుకున్న 2003-04 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు షఫీ, ఏకవీర శేఖర్ మాట్లాడుతూ క్రీడల్లో లావణ్య రాణించాలని కోరారు.

డీజీపీని కలిసిన రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డీజీపీ తిరుమలరావును మంత్రాలయం టీడీపీ నియోజకర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి శుక్రవారం అమరావతిలో కలిశారు. ఆయనను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రాలయంలో పోలీసు సేవలు, సిబ్బంది కొరత వంటి అంశాలపై చర్చించారు. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ యువ నాయకులు రాకేష్ రెడ్డి ఉన్నారు.


డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐటీఐ కాలేజీ లో పూలే, అంబేద్కర్ ఐడియాలజీ అధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పూలే, అంబే డ్కర్ ఐడియాలజీ కన్వీనర్ దేవదానం అధ్యక్షత వహించారు. బహుజన వక్త భాస్కర్, బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి మాదన్న మాట్లాడుతూ స్వతంత్ర్య భారత రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక హక్కులు రాజ్యాంగ బద్ధం చేసి బహుజనుల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయులను కొనియాడారు. ప్రతి ఒక్క పౌరుడు రాజ్యాంగంలోని హక్కులను చదివి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఫీక్, భోజరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దేవదానం

మంత్రాలయంలో కర్ణాటక దేవదాయ శాఖ కమిషనర్

మంత్రాలయం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని కర్ణాటక రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎంవీ వెంకటేష్ శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట అనంతపురాణిక్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

18న గ్రామ సచివాలయం ముందు ధర్నా

కౌతాళం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న అన్ని గ్రామాల సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ మంత్రాలయం నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టి ఇస్తామని చెప్పి పేదలను మోసం చేసిందన్నారు. ప్రస్తుత అధికార పార్టీ ప్రభుత్వం కూడా పల్లె ప్రజలకు మూడు సెంట్ల స్థలం, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామని తెలిపి నేటికీ కార్యాచరణ చేపట్టలేదన్నారు. దీనిని నిరసిస్తూ ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడిన కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితకు వత్తాసు పలుకుతూ తిరిగి బాధ్యతలు ఇవ్వడం సిగ్గుచేటు అని, తక్షణమే విధుల నుంచి తొలగించాలని యూఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవా రం కస్తూర్బా పాఠశాలల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవానంద రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ విద్యార్థుల కడుపు మాడ్చి సొమ్ము చేసుకున్న కవితను తిరిగి అక్కడే పోస్టింగ్ ఇవ్వడం అంటే అవినీతిని ప్రోత్సహించడమేనని అన్నారు. తక్షణమే ఎస్ఓ కవితను విధుల నుండి తొలగించాలని విద్యార్థి సంఘాలుగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాన్, బాబు, రవి, మోహన్ పాల్గొన్నారు.


కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న యూఎస్‌ఎఫ్ నాయకులు

కురువల అభివృద్ధికి సహకరించాలి

గోనెగండ్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కురువల అభివృద్ధికి సహకారం అందించా లని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని కురువ కురుబ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ కోరారు. శుక్రవారం విజయ వాడలో అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్యేను రామకృష్ణ కలిసి సన్మానించారు. తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ, కురువల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.


ఎమ్మెల్యే బీవీని కలిసిన కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ

ప్రభుత్వమే నిర్వహించాలి

గోనెగండ్ల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలని గోనెగండ్ల మండల 108 సిబ్బంది సంఘం నాయకులు ఈఎంటీ వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కుమారస్వామికి వినతి పత్రం అందజేశారు.

ముళ్ల పొదలు తొలగింపు

కోసిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లబండ సర్పంచ్ మల్లికార్జున, టీడీపీ నాయకుడు మజ్జిగ అయ్యప్ప ఆధ్వర్యంలో అర్లబండ నుంచి కోసిగి అడ్డ రోడ్డు తారు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ముళ్ల పొదలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. అలాగే కామన్‌దొడ్డి తారురోడ్డ ఇరువైపులా రోడ్డు కప్పుకున్న ముళ్ల కంపను తొలగించినట్లు సర్పంచ్ మల్లికార్జున తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు రావడంతో గ్రామాభివృద్ధి పనులకు ఉపయోగపడుతున్నట్లు తెలిపారు.

'సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి'

పెద్దకడబూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు తిక్కన్న, పరమేష్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రైతులతో కలిసి సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. నాయకులు శ్రీనివాసులు, ఈరన్న, రైతులు పాల్గొన్నారు.